

అమ్మో టమాటా !

పలమనేరు టమాటా మార్కెట్‌లో శుక్రవారం బాక్సు (15 కిలోలు) ధర అత్యధికంగా రూ. 1,600 పలికింది.

- 8లో



బియ్యం ధరల నియంత్రణకు చర్యలు

రైతు బజార్లు, మార్కెట్ యార్డుల్లో బియ్యం ధరల నియంత్రణకు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు జేసీ శ్రీనివాసులు తెలిపారు.

- 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	36	26
తిరుపతి	37	27
తిరుమల	32	22
గూడూరు	38	28
నగరి	37	27

న్యూస్‌రీల్

గణనాథుని హుండీ ఆదాయం రూ.1.19 కోట్లు



కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ.1.19కోట్ల ఆదాయం లభించినట్లు చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. శుక్రవారం ఆలయ ఆస్థాన మండపంలో 14 రోజుల హుండీ కానుకలను లెక్కించారు. బంగారం 85 గ్రాములు, వెండి కిలో 950 గ్రాములు, గో సంరక్షణ హుండీ ద్వారా రూ. 10 వేలు, ఫారిన్ కరెన్సీ యూఎస్ఏ డాలర్లు 2,648, ఆస్ట్రేలియా డాలర్లు 60, కెనడా డాలర్లు 85, సింగపూర్ డాలర్లు 10 డాలర్లు, యూఏఈ దీరమ్స్ 75తో కలిపి రూ.1.19కోట్లు ఆదాయం వచ్చినట్లు వివరించారు. కానుకల లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, హేమమాలిని, హరి మాధవ రెడ్డి, పర్యవేక్షకులు రవి, రంగస్వామి, దేవస్థానం సిబ్బంది, యూనియన్ బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

బోయకొండలో ఆషాఢ రద్దీ



చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీబోయకొండ గంగమ్మ ఆలయం ఆషాఢ మాసం చివరి శుక్రవారం భక్తులతో పోటెత్తింది. ఉదయం 10–30 నుంచి 12 వరకు అమ్మవారికి వేదోక్తంగా రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. పరిమళభరిత పుష్పమాలికలు, విశేష అభరణాలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. రాహుకేతు పూజల్లో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన 150 మంది దంపతులు పాల్గొన్నారు. కోర్కెలు తీరిన భక్తులు మొక్కుబడులు చెల్లించారు. కర్ణాటక రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎస్ఐ రవికుమార్ నిఘా ఏర్పాటుచేశారు.

పక్కాగా భూ రీ సర్వే



వివరాలను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: భూ రీ సర్వేను క్షేత్రస్థాయి నిర్ణీత గడువు లోపు ఎటువంటి పొరబాట్లు లేకుండా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం చిత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే ప్రక్రియను నిర్వహిస్తున్న సర్వేయర్లుతో సమావేశం నిర్వహించారు. పిటీషన్లు, మ్యుటేషన్లను సకాలంలో పరిష్కరించాలన్నారు. గడువు మేరకు వీఆర్‌ఓ, తహసీల్దార్ లాగిన్లలో వివరాలను అప్‌లోడ్ చేయాలని తెలిపారు. గ్రౌండ్ ట్రూతింగ్ చాల ముఖ్యమైందని, ఎటువంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భూయజమానులు కూడ అందు బాటులో ఉండేలా చూడాలని తెలిపారు. సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ గౌస్ బాషా, తహసీల్దార్ మురళి, డీటీలు కిరణ్, ధనంజయ పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

పూతలపట్టు: మండలంలోని స్వయం సహాయక సంఘ సభ్యులు రుణాలను సక్రమంగా వినియోగించుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ పీడీ తులసి అన్నారు. శుక్రవారం పూతలపట్టు వెలుగు కార్యాలయంలో జరిగిన మహిళ సమాఖ్య సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ సంఘ సభ్యులు బ్యాంకుల్లో పొందిన రుణాలను సకాలంలో తిరిగి చెల్లించి, తిరిగి రుణాలు పొందాలని పేర్కొన్నారు. రుణాలను సద్వినియోగం చేసుకుంటూ జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలన్నారు. సంఘాలను పటిష్టంగా నిర్వహిస్తూ ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. ఐక్యంగా గ్రామాభివృద్ధికి తోడ్పడాలన్నారు. శుక్రవారం మండలంలోని ఏపీఎం నాగరత్న, సీసీలు శోభన్‌బాబు, సోమశేఖర్, తేజవతి తదితరులు పాల్గొన్నారు.

జాబిలితో చెప్పనా!

నిప్పులు చిమ్ముతూ.. మబ్బులు చీల్చుకుంటూ.. జాబిల్లి వైపు దూసుకెళ్లిన చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతంతో స్థానికులు సంబరాల్లో మునిగితేలారు. ఈలలేస్తూ చప్పట్లతో సాగనంపారు. జెండాలూపుతూ విజయగర్వంతో ఊగిపోయారు. నింగిలో కనిపిస్తున్నంత సేపు మునేళ్లపై నిలబడి తీక్షణంగా చూస్తూ నిలబడిపోయారు. కొందరు బైనాకూలర్లతో చూసి ఆనంద సాగరంలో మునిగితేలారు. మరికొందరు తమ సెల్ ఫోన్లలో బంధించి మురిసిపోయారు. నెలరాజుపై సాఫీగా దిగి..నిగూఢ రహస్యాలు ఛేదించాలని ఆకాంక్షించారు.

- చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం
- భూకక్ష్యలోకి చేరిన ఉపగ్రహాలు
- ఉత్కంఠగా ఎదురు చూసిన స్థానికులు
- ప్రేక్షకులతో నిండిన గ్యాలరీలు
- శాస్త్రవేత్తలకు వెల్లువెత్తిన అభినందనలు





నింగిలోకి దూసుకెళ్తున్న ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్



విడిపోతున్న బూస్టర్లు | విడిపోతున్న హీట్‌షీల్డ్స్ | ద్రవ ఇంధనంతో నింగివైపు.. | రెండోదశలో విడిపోతూ.. | కక్ష్యలోకి వెళుతున్న చంద్రయాన్-3 | చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెడుతూ

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి శుక్రవారం మధ్యాహ్నం 2.35 గంటలకు ఎల్‌వీఎం 3–ఎం4 రాకెట్ ద్వారా చంద్రయాన్–3 మిషన్‌ను విజయవంతంగా ప్రయోగించారు. ఈ ప్రయోగం పూర్తిస్థాయిలో విజయం సాధించాలంటే ఆగస్టు 23 దాకా వేచి చూడాల్సి ఉన్నప్పటికీ ఎల్‌వీఎం3–ఎం4 రాకెట్ 3,920 కిలోల బరువు కలిగిన చంద్రయాన్–3 ఉపగ్రహాన్ని నిర్ణీత సమయంలో నిర్దేశిత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టి మొదటి దశ విజయాన్ని అందుకున్నారు.

మూడు దశల రాకెట్ ప్రయాణం ఇలా..

ఎల్‌వీఎం3–ఎం4 రాకెట్ 43.43 పొడవు కలిగి 640 టన్నుల బరువుతో శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి నింగిలోకి నిప్పులు చిమ్ముకుంటూ మూడు దశలను ఛేదిస్తూ విజయవంతంగా దూసుకెళ్లింది. చంద్రయాన్–3 ఉపగ్రహంలో 2,145 కిలోల బరువు కలిగిన ప్రొపల్షన్ మాడ్యూల్, 1,749 కిలోల బరువు కలిగిన ల్యాండర్, 26 కిలోల బరువు కలిగిన రోవర్‌లను చందమామపై పరిశోధనలకు విజయవంతంగా పంపించారు. ఇందులో ఆరు ఇండియన్ పేలోడ్స్‌తో పాటు ఆమెరికా నాసాకు చెందిన ఒక పేలోడ్‌ను పంపించారు.

- మొదటి దశలో ఇరువైపులా అత్యంత శక్తివంతమైన ఎస్–200 బూస్టర్లు సాయంతో నింగికి పయనమై రెండు స్ట్రాపాన్ బూస్టర్లులో 400 టన్నుల ఘన ఇంధనం సాయంతో 127 సెకండ్లలో మొదటి దశ పూర్తి చేశారు.
- రెండో దశలో ఎల్–110 అంటే 110 టన్నుల ద్రవ ఇంధనాన్ని ఉపయోగించి 305.56 సెకండ్లకు రెండో దశను పూర్తి చేశారు.

ఈ మధ్యలో 194.96 సెకండ్లకు రాకెట్ శిఖర భాగాన చంద్రయాన్–3 మిషన్‌కు రెండువైపులా అమర్చిన హీట్‌షీల్డ్స్ విడిపోయాయి.

- మూడోదశలో 958.71 సెకండ్లకు 25 టన్నుల క్రయోజనిక్ ఇంధనాన్ని వినియోగించి 954.42 సెకండ్లకు కటాఫ్ చేశారు.

రాకెట్‌కు శిఖరభాగాన అమర్చిన త్రీ–ఇన్–వన్ మిషన్ చంద్రయాన్–3 ఉపగ్రహాన్ని భూమికి దూరంగా (అపోజి) 36,500 కిలోమీటర్ల ఎత్తులో హైలీ ఎసిన్‌ట్రిక్ ఆర్బిట్(అత్యంత విపరీతమైన కక్ష్య)లోకి ప్రవేశపెట్టి చరిత్రాత్మకమైన విజయాన్ని నమోదు చేశారు.

ఇస్రో బృందానికి శ్రీసిటీ ఎండీ అభినందనలు

తడ: శ్రీహరికోట నుంచి శుక్రవారం లాంచ్ వెహికల్ మార్క్– 3 ద్వారా చంద్రయాన్–3ని విజయవంతంగా భూ కక్ష్యలో ప్రవేశ పెట్టిన ఇస్రో బృందానికి శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలిపారు. భారత ఖ్యాతిని ప్రపంచానికి వ్యాప్తి చేసిన ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్, షార్ డైరెక్టర్ రాజరాజన్, ఇతర శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు.

చప్పట్లతో మార్మోగిన గ్యాలరీలు

సతీష్ ధవన్ స్పేస్‌సెంటర్ షార్ నుంచి శుక్రవారం మధ్యాహ్నం 2.35 గంటలకు ప్రయోగించిన ఎల్‌వీఎం3–ఎం4 ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుంచే కాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు పది వేల మందిదాకా విచ్చేశారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు కార్లు, స్కూల్ వ్యాన్‌లు, బస్సులు బారులు తీరాయి. అయితే షార్ కేంద్రం వారు మాత్రం ప్రతి రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు అనువుగా శ్రీహరికోటలోనే ఒక ప్రత్యేక గాలరీని ఏర్పాటు చేశారు. జమ్ము కశ్మీర్ నుంచి కూడా వీక్షకులు తరలివచ్చారు. రాకెట్ ప్రయోగాన్ని వీక్షించాలనుకునే వారితో పులికాట్ సరస్సులోని రోడ్డు కిక్కిరిసింది. రాకెట్ నింగికేగుతున్న సమయంలో వారంతా కొట్టిన చప్పట్లు, ఈలలు, కేకలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.



జైహింద్: రాకెట్ ప్రయోగాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న వీక్షకులు



జయహో చంద్రయాన్ - వీక్షకులతో కిక్కిరిసిన గ్యాలరీలు

ఆపత్కాల వాహిని 108



▸▸ చౌడేపల్లె మండలం ముదిరెడిపల్లె అటవీ ప్రాంతంలోని ఓ మామిడి తోటలో వసంత అనే గర్భిణి తన భర్తతో కలిసి కాపలగా ఉంటోంది. మే 28న ఈ ఆమెకు పురిటి నొప్పులు ఆరంభమయ్యాయి. భర్తతోపాటు మరో మహిళ 108కి సమాచారం అందించారు. సిబ్బంది వెంటనే స్పందించి ఆ ప్రాంతానికి చేరుకున్నారు. పంట పొలాల మీదుగా కాస్త రోడ్డు సరిగా లేకపోవడంతో 108 సిబ్బంది కాలినడకన వెళ్లి ఆ ఈ గర్భిణికి ప్రసవం చేయగా, మగబిడ్డ జన్మించాడు. ఆ తర్వాత స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు.



▸▸ పెద్దపంజాణి మండలం చిన్నేపల్లెకు చెందిన తహసీనా నెల రోజుల క్రితం ప్రసవం కోసం 108ని ఆశ్రయించారు. వెంటనే స్పందించిన 108 సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బీపీ అధికంగా ఉందని చిత్తూరు జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. మార్గమధ్యంలో పురిటినొప్పులు అధికం కావడంతో సిబ్బంది బండిని రోడ్డు పక్కన ఆపి, సుఖ ప్రసవం చేయించారు. తల్లీబిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నారు.



ప్రజలు ఆపదలో ఉన్నారన్న సమాచారమందితే చాలు.. క్షణాల్లో వచ్చేస్తుంది ఈ ఆపత్కాల వాహిని. ప్రమాదాల్లో గాయపడిన వారు వైద్యం అందకుండా చనిపోయే పరిస్థితి రాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ 108 వాహనాలను తీసుకొచ్చింది. ఆ అంబులెన్సుల్లోఅత్యాధునిక వసతులను సమకూర్చింది. సరిపడా సిబ్బందిని నియమించింది. తద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను నిలబెట్టేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టింది. మరమ్మతుకు గురైన వాహనాల స్థానంలో కొత్తవి అందజేసింది. ప్రజల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది.

- ఫోన్‌చేస్తే క్షణాల్లో కుయ్..కుయ్..
- ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం
- జిల్లాకు ఎనిమిది కొత్త 108 అంబులెన్సులు మంజూరు

చిత్తూరు రూరల్: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. అందులో భాగంగా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. నాడు–నేడు కింద ఆస్పత్రులకు ఆధునిక వసతులు సమకూర్చుతోంది. వైద్యులు, సిబ్బంది నియామకాలతోపాటు ఆధునిక వైద్యపరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చింది. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడికి ఖరీదైన వైద్యాన్ని నెట్ వర్క్ ఆస్పత్రుల్లో ఉచితంగా అందిస్తోంది. చికిత్సానంతరం ఆరోగ్య ఆసరా కింద భృతిని చెల్లిస్తోంది. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా పల్లె ముంగిట వైద్యసేవలు అందిస్తోంది. ఆపదవేళ ఆదుకుంటున్న 108 వాహన సేవలను గ్రామీణులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. మరమ్మతులకు గురైన అంబులెన్స్‌ల స్థానంలో జిల్లాకు 8 వాహనాలను సమకూర్చింది.

జిల్లాలో 33 అంబులెన్స్‌లు

జిల్లాలో 108 అంబులెన్సులు 33 ఉన్నాయి. నెలకు 4 వేల మందికి పైగా రోగులకు 108 సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయ పడినవారు, పాముకాటుకు గురైన వారు, అగ్ని ప్రమాదాల బాధితులు, గుండె జబ్బులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడేవారు, గర్భిణులు ఇలా... ఆపద సమయంలో ఉన్న వారందరికీ 108 సేవలు వరంగా మారాయి.

కొత్తగా 8 వాహనాలు

జిల్లాలో మరమ్మతులకు గురైన వాహనాల స్థానంలో 8 కొత్త అంబులెన్సులు వచ్చాయి. ఈ వాహనాలను వి.కోట, బైరెడ్డిపల్లి, కాణిపాకం, సదుం, గుడిపాల, చిత్తూరు, జీడీ నెల్లూరు, ఎస్ఆర్ పురం మండలాలకు మంజూరు చేశారు. రెండు రోజులకు క్రితమే ఈ వాహనాలు జిల్లాకు చేరుకున్నాయి. కేటాయింపు ప్రకారం ఆయా మండలాలకు వాహనాలను తరలించారు.

ఇవీ సదుపాయాలు

108 అంబులెన్సుల్లో రెండు ఆక్సిజన్ సిలిండర్లతో కూడిన సిస్టమ్ ఉంటుంది. మల్టీపారామీటర్ (బీపీ పల్స్, ఆక్సిజన్ శాతం తెలుసుకోవడానికి ఉపయోగించేది), మధుమేహ పరీక్ష చేసేందుకు గ్లూకోమీటర్ సిరంజ్ పంపు (మందు ఎంత మోతాదులో ఇవ్వాలో తెలియజేసేది), స్ట్రెచ్చర్, వీల్ చైర్, బీపీ ఆపరేటర్, మానిటర్, వాల్యూమ్ ఇన్ఫ్యూజన్‌పంపు, మందులు వంటి సౌకర్యాలు అంబులెన్సులో ఉంటాయి.



లోపలిభాగం

108 అంబులెన్స్‌లు అందించిన సేవల వివరాలు	
నెల	సంఖ్య
ఫిబ్రవరి	4,144
మార్చి	4,340
ఏప్రిల్	3,864
మే	4,837
జూన్	4,518

క్షణాల్లో నిలిచి..ప్రాణాలు నిలిపి..

ప్రమాదం జరిగింది.. ఆపదలో ఉన్నామన్న సమాచారం అందగానే 108 అంబులెన్సు కుయ్ కుయ్ అంటూ ఘటన స్థలానికి క్షణాల్లో చేరుకుంటోంది. పట్టణ ప్రాంతాల్లో 15 నిమిషాల్లోను, పల్లె ప్రాంతాల్లో అయితే 20 నుంచి 30 నిమిషాల్లో 108 అంబులెన్సులు సంఘటన స్థలానికి చేరుకుంటున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో మార్గమధ్యమంలో సిబ్బంది ప్రాథమిక వైద్య సేవలు అందిస్తూ, ప్రాణాలు నిలబెడుతున్నారు. వెంటనే ఆస్పత్రికి చేర్చుతున్నారు. ఇలా ప్రజల ప్రాణాలను 108 కాపాడుతోంది.

“ వైద్యరంగం మెరుగు



రాష్ట్ర ప్రభుత్వ వైద్య రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. 108 అంబులెన్సులు కొన్ని మండలాల్లో శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ స్థానంలో కొత్తగా వాహనాలను తీసుకొచ్చారు. రోగుల ప్రాణాలు కాపాడాలన్న లక్ష్యంతో సేవలు అందిస్తున్నాయి. ఆపదలో సేవలందించేందుకు అధునాతన సదుపాయాలతో కూడిన కొత్త వాహనాలను ప్రభుత్వం అందజేసింది.

–మోహన్‌బాబు, 108 జిల్లా మేనేజర్, చిత్తూరు

ఎస్సీ,ఎస్టీల అభ్యున్నతే సర్కార్ ధ్యేయం



మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప, పక్కన కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి

- సమస్యల పరిష్కారంలో అధికారులు భాగస్వామ్యం కావాలి
- విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ రెడ్డెప్ప
- 3 వేల మందికి త్వరలో పట్టాల పంపిణీ – జిల్లా కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ పార్టీలు, కులాలు, వర్గాలకతీతంగా ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందన్నారు. సమస్యల పరిష్కారంలో కమిటీ, అధికారులు భాగస్వామ్యులు కావాలని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కుటుంబాలకు చెందిన 3 వేల మందికి అసైన్‌మెంట్ కమిటీ ఆమోదంతో త్వరలో పట్టాలు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో డివిజన్ స్థాయి సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. ఎస్సీ,ఎస్టీలకు జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాకాలపై ఈనెల 21న అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎస్సీ,ఎస్టీల నివాస ప్రాంతాల్లో శ్మశాన వాటికల ఏర్పాటుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. పీవోఏ, పీసీఆర్ చట్టం 1989 ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు మార్చి 21 నుంచి జూన్ 30 వరకు 50 మందికి రూ.40,62,000 అందించినట్లు తెలిపారు.

పారదర్శకంగా కేసుల పరిష్కారం

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులను పారదర్శకంగా పరిష్కరిస్తున్నట్లు ఎస్పీ రిశాంత్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖాధికారి, కన్వీనర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 29న జరిగిన సమావేశంలో సభ్యుల సమస్యలపై అధికారులు చేపట్టిన పరిష్కారాలను వివరించారు. అనంతరం సభ్యులు, పలు సంఘాల నాయకులు కొన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మొదటిసారిగా గుర్తింపుకార్డులు ఇచ్చినందుకు కలెక్టర్‌కు డీవీఎంసీ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, ఏఎస్పీ శ్రీలక్ష్మి, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, సీపీవో ఉమాదేవి, ఆర్డీవోలు రేణుక, సుజన, నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ, డీవీఎంసీ సభ్యులు చిత్తూరు బాబు, దేవరాజులు, డేవిడ్, రాజ్‌కుమార్, ఎల్లప్ప పాల్గొన్నారు.

క్లుప్తంగా

బియ్యం ధరల నియంత్రణకు చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని రైతు బజార్, మార్కెట్ యార్డుల్లో బియ్యం ధరల నియంత్రణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు వెల్లడించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జేసీ సమావేశ మందిరంలో వివిధ శాఖాధికారులు, బియ్యం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో 70 నుంచి 80 వరకు బియ్యం కౌంటర్లను రైతు బజార్లలో, మార్కెట్ యార్డుల్లో తెరిపించాలన్నారు. కిలో సోనా మసూరి నాణ్యమైన బియ్యం రూ.44.50 విక్రయించాలని ఆదేశించారు. అధిక ధరలకు బియ్యం అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలను కచ్చితంగా పాటించాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వరన్, డీఎస్‌వో శంకరన్, సివిల్ సప్‌లైస్ డీఎం మోహన్, బియ్యం విక్రయాల అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

81 అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవచ్చని ఐసీడీఎస్ పీడీ నాగశైలజ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు 24, మినీ కార్యకర్త పోస్టులు 17, అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు 40 మొత్తం 81 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. సంబంధిత సీడీపీవో కార్యాలయాల్లో ఖాళీల వివరాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అర్హత ఉన్న వారు ఈనెల 22వ తేదీ వరకు సీడీపీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు ఆయా సీడీపీవో కార్యాలయాల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

ఉద్యోగ విరమణ పెంపుపై అర్చకుల ఆనందం

- దేవదాయ శాఖ ఉద్యోగులకు వరాలు
- ముఖ్యమంత్రికి అర్చకుల ధన్యవాదాలు



ముఖ్యమంత్రి, మంత్రులకు ధన్యవాదాలు చెబుతున్న కాణిపాకం దేవస్థానం చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, అర్చకులు, వేదపండితులు

కాణిపాకం(యాదమరి): దేవదాయ శాఖ పరిధిలోని ఉద్యోగులు, అర్చకులు, వేదపండితులకు వరాలు ఇస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కేబినెట్‌లో తీర్మానం చేయడంపై కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, అర్చకులు, వేదపండితులు, ఉద్యోగులు ధన్యవాదాలు తెలిపారు. తమకు మేలు చేకూర్చే విధంగా నిర్ణయాలు తీసుకున్న ముఖ్యమంత్రి నిండు నూరేళ్లు వర్ధిల్లాలని కోరారు. శుక్రవారం ఆలయ సమావేశ మందిరంలో ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతు రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో దేవదాయ శాఖలోని ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచడం, చిన్న ఆలయాల్లో అర్చకులుగా పనిచేస్తున్న వారికి పదవీ విరమణ లేకుండా చేయడం, అర్చకుల జీతాలు రూ.5 వేలు నుంచి రూ.10వేలు పెంచడం, చిన్న దేవాలయాల అభివృద్ధి, టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా కాలనీల్లో రామాలయాల నిర్మాణాలకు ముఖ్యమంత్రి ఆమోదం తెలుపడం హర్షణీయమని తెలిపారు. ముఖ్యమంత్రితో పాటు దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, విశాఖ శారదపీఠం స్వాములకు, దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, సోమశేఖర్ గురుకుల్, వేదపండితులు సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఏజెంట్ పవన్



మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప

చిత్తూరు కలెక్టరేట్ : చంద్రబాబు నాయుడుకు జనసేన అధినేత దత్తపుత్రుడు, ఏజెంట్ అని, ప్రజాసేవ చేస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు సరికాదని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప ఘాటుగా విమర్శించారు. కలెక్టరేట్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ ఎంతో నిస్వార్థంగా పనిచేస్తున్నారన్నారు. ఒక వ్యవస్థను అవమానించేలా మాట్లాడడం దారుణమని పేర్కొన్నారు. ఏపీలో తన గురించి మాత్రమే ప్రతి ఒక్కరు మాట్లాడుకోవాలనే ధోరణితో అవాకులు చెవాకులు పేలుతున్నారని విమర్శించారు. సొంత అన్న చిరంజీవికి చెడ్డపేరు తీసుకురావడం ఆయన ముఖ్య ఉద్దేశమని చెప్పారు. మహిళల పట్ల ఇష్టానుసారంగా మాట్లాడడం సరైన విధానం కాదన్నారు. కుప్పం నియోజకవర్గ ప్రజలందరూ వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సారథ్యంలో వచ్చే ఎన్నికల్లో కుప్పంలో భరత్ గెలుపు ఖాయమని ఎంపీ తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏ ఆత్మహత్య



గోవిందప్ప (ఫైల్)

గుడుపల్లె: మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన వీఆర్‌ఏ గోవిందప్ప (72) మనస్తాపంతో తహసీల్దార్ కార్యాలయంలోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ లక్ష్మీకాంత్ కథనం మేరకు వివరాలిలా.. మండలంలోని ఓఎన్ కొత్తూరు పంచాయతీ అగ్రహారానికి చెందిన గోవిందప్ప గురువారం రాత్రి తహశీల్దారు కార్యాలయంలో విధులు నిర్వహించారు. శుక్రవారం ఉదయం సహచర వీఆర్‌ఏ ఇంటికి వెళ్లారు. గోవిందప్ప కార్యాలయంలోని ఫ్యాన్‌కు ఉరేసుకున్నారు. ఉదయం కార్యాలయానికి వచ్చిన అధికారులు గదిలో గోవిందప్ప ఉరికి వేలాడుతుండగా గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్‌కు తరలించారు. అనంతరం బంధువులకు అప్పగించారు. కుటుంబ సమస్యలతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వీఆర్‌ఏ మృతికి తహసీల్దార్ గురప్ప సంతాపం తెలిపారు. అంత్యక్రియల కోసం ఆయన కుటుంబానికి రూ.25 వేలు సాయం అందించారు.

చీటింగ్ కేసులో అరెస్టు

చిత్తూరు అర్బన్: అధిక వడ్డీలు ఇస్తామని చిత్తూరులో పలువురి నుంచి నగదు వసూలు చేసి పారిపోయిన కేసులో నిందితుడు విజయ్‌ను వన్‌టౌన్ ఎస్ఐ వసంతకుమారి శుక్రవారం అరెస్టు చేశారు. ఏఆర్‌టీ జ్యూవెలర్స్ పేరిట పలువురి నుంచి పెద్ద మొత్తంలో నగదు వసూలు చేసిన విజయన్ గత కొన్నిరోజులుగా కనిపించడం లేదని. తమను మోసం చేసి పారిపోయాడని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. మేజిస్ట్రేట్ ఆదేశాలతో చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు.

కిరాతక కానిస్టేబుల్‌పై కేసు

పలమనేరు: మూడో సారి కూడా ఆడపిల్లను కనిందని భార్యను చిత్రహింసలకు గురిచేసిన కేసులో భర్త, ఆర్టీసీ డిపో సెక్యూరిటీ కానిస్టేబుల్ ఎస్ఎం చాన్‌బాషాపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ బాధితురాలు సబీహా ఫిర్యాదు మేరకు ఐపీసీ సెక్షన్ 498 కేసును నమోదు చేశామన్నారు. నిందితుడు ఆర్టీసీలో సెక్యూరిటీ కానిస్టేబుల్‌గా ఉండడంతో ఆశాఖ ఉన్నతాధికారులకు సైతం విషయాన్ని తెలిపామన్నారు. ఆడబిడ్డలు పుట్టినందుకు తమ కొడుక్కి మరో పెళ్లి చేస్తామని చెప్పిన నిందితుడి తల్లిదండ్రులను కూడా విచారిస్తున్నామని, దీనిపై చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,460

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79.00

గిరిజన తండాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

రామకుప్పం: గిరిజన తండాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని విధాలా కృషి చేస్తున్నారని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని వీర్నమల, పెద్దతండా గ్రామాల ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన తండాల అభివృద్ధిలో భాగంగా అర్హులైన గిరిజనులకు భూ పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్య ద్వారా గిరిజనులు అభివృద్ధిని సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చి అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. గిరిజన గ్రామాల్లో సీసీ రోడ్లు, నీటి ట్యాంకుల నిర్మాణాలు చేపట్టాలని అధికారులను కోరారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను ఉన్నతాధికారులకు విన్నవించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. రామకుప్పం సమీపంలోని గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. ఆర్డీఓ శివయ్య, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి మూర్తి, తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ రాధాకృష్ణ, సర్పంచ్ మోహన్ నాయక్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో-కన్వీనర్ చంద్రారెడ్డి, నేతలు రవినాయక్, చిన్నరాజునాయక్, అధికారులు పాల్గొన్నారు.

అమ్మో టమాటా !

- పలమనేరులో బాక్సు రూ.1,600
- కర్ణాటక మార్కెట్‌ను మించిన ధర



పలమనేరు మార్కెట్‌కొచ్చిన నాణ్యమైన టమాటాలు

పలమనేరు : పలమనేరు టమాటా మార్కెట్‌లో శుక్రవారం బాక్సు(15 కిలోలు) ధర అత్యధికంగా రూ.1,600 పలికింది. పక్కనే ఉన్న కర్ణాటకలోని వడ్డిపల్లె, అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె మార్కెట్ల కంటే పలమనేరులో రూ.100 అధికంగా ధర పలికింది. ఉత్తరాది రాష్ట్రాల్లో వరదల కారణంగా టమాట పంట లేదు. కర్ణాటక, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో పంటకు తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గింది. దీంతో భారీగా డిమాండ్ పెరిగింది. పలమనేరు మార్కెట్‌లో నాణ్యమైన సరుకు ఉండడంతో పలు రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ఇక్కడి టమాటా కొనేందుకు ఎగబడుతున్నారు. ఫలితంగా ఇక్కడ ధర అధికంగా ఉందని స్థానిక మండీ వ్యాపారులు చెబుతున్నారు.

రాష్ట్ర గవర్నర్‌కు స్వాగతం, వీడ్కోలు



రేణిగుంట విమానాశ్రయంలో గవర్నర్‌కు వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

రేణిగుంట: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు శుక్రవారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. తిరుపతి పర్యటన నిమిత్తం విచ్చేసిన ఆయనకు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, నగర పాలక కమిషనర్ హరిత, కేంద్ర సాంస్కృతిక శాఖ సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు విమానాశ్రయంలో స్వాగతం పలికారు.

వీడ్కోలు

తిరుపతి పర్యటన అనంతరం విమానాశ్రయానికి చేరుకుని గవర్నర్‌కు కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, లైజన్ ఆఫీసర్ భాస్కర్‌నాయుడు, ఎయిర్‌పోర్ట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి వీడ్కోలు పలికారు.

వైఎస్సార్ సీపీలోకి 70 టీడీపీ కుటుంబాలు



తలారిపల్లిలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల(తిరుపతి రూరల్): పాకాల మండలం, ఇరంగారిపల్లి పంచాయతీ, తలారిపల్లికి చెందిన టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం రాములవారి గుడి వద్ద వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మోహిత్‌రెడ్డి నాయకత్వం, పార్టీ సిద్ధాంతాలు నచ్చడంతో పాటు సీఎం జగనన్న పాలన, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సేవాతత్వానికి ఆకర్షితులై పార్టీలో చేరినట్టు తెలిపారు. భవిష్యత్తులో తిరుగులేని పార్టీగా వైఎస్సార్‌సీపీ నిలుస్తుందని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో గుణశేఖర్, లక్ష్మీపతి, మోహిత్, విష్ణు, భారతి, సుమంత్, గుణశేఖర్, నస్రీన్ భాను, ధనమ్మ, బుజ్జి, నాగరాజ, మురళి, నరేష్, వాసు, ఉమ, మోహన్ తదితర 70 కుటుంబాల వారు ఉన్నారు.

తలారిపల్లిలో మోహిత్‌రెడ్డికి అపూర్వ స్వాగతం

పాకాల(తిరుపతి రూరల్): పాకాల మండలం, తలారిపల్లిలో గడపగడపకు మహా పాదయాత్ర కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రతి గడపలో ప్రజలు మోహిత్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. అంతకుముందు నాయకులు గజమాలతో సత్కరించారు. అనంతరం లబ్ధిదారులకు సంక్షేమ బుక్ లెట్లను అందజేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమం, అభివృద్ధి జరిగిందని నమ్మితేనే 2024 ఎన్నికల్లో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కరోనా, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేసిన సేవలను వివరించారు. ప్రతి పల్లె అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నట్లు వెల్లడించారు.



తలారిపల్లిలో సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడి

చంద్రయాన్-3 ప్రయోగంలో మహిళా శక్తి



మిషన్ కంట్రోల్ సెంటర్‌లో చంద్రయాన్-3 ప్రయోగాన్ని వీక్షిస్తున్న మహిళా శాస్త్రవేత్తలు

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అత్యంత ప్రతిష్టాత్మకంగా శుక్రవారం మధ్యాహ్నం ప్రయోగించిన చంద్రయాన్-3 ప్రాజెక్టులో 30 శాతం మంది మహిళా శాస్త్రవేత్తలు పనిచేసినట్టు తెలుస్తోంది. అంతరిక్ష శాస్త్ర విజ్ఞాన రంగం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో తామేమీ తక్కువ కాదన్నట్టుగా చంద్రయాన్-2 ప్రయోగంలో పనిచేసిన 30 శాతం మంది మహిళలు, చంద్రయాన్-3లో కూడా పనిచేశారు. త్రీ-ఇన్-ఒన్‌గా చెప్పబడుతున్న చంద్రయాన్-3 ప్రాజెక్టులో ప్రపొల్షన్ మాడ్యూల్, ల్యాండర్, రోవర్లు రూపొందించడంలో మహిళా శాస్త్రవేత్తల కృషి కూడా ఉంది. అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్, బెంగళూరులోని ప్రొఫెసర్ యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో పురుష శాస్త్రవేత్తలకన్నా తామేమీ తక్కువ కాదన్నట్టుగా పనిచేసి ల్యాండర్, రోవర్‌ను రూపొందించడంలో మహిళా శాస్త్రవేత్తలు భాగస్వామ్యం కూడా కలిసింది. ఇస్రోలో 30 మంది మహిళా శాస్త్రవేత్తలు పనిచేస్తుండగా ఈ ప్రయోగంలో రీతూ కరిథల్, ఎం.వనిత అత్యంత కీలక వ్యక్తులుగా పనిచేశారు. బాలు శ్రీ దేశాయ్, డాక్టర్ సీత, కే కల్పన, టెస్సీ థామస్, డాక్టర్ నేహ సటక్ తదితర మహిళా శాస్త్రవేత్తలు ఈ ప్రయోగంలో భాగస్వాములై మహిళాశక్తిని నిరూపించారు.

రాకెట్ ఉమెన్ ఆఫ్ ఇండియా రీతూ కరిథల్

చంద్రయాన్-2 మిషన్ డైరెక్టర్‌గా వ్యవహరించిన రీతూ కరిథల్ 'రాకెట్ ఉమెన్ ఆఫ్ ఇండియా'గా ఇస్రోలో అందరూ పిలుస్తున్నారు. మార్స్ ఆర్బిటర్ మిషన్ ప్రయోగంలో కూడా ఆమె డిప్యూటీ ఆపరేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఈమె 2007లో మాజీ రాష్ట్రపతి, అణు పరీక్షల నిపుణులు దివంగత డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం చేతులు మీదగా ఇస్రో యంగ్ సైంటిస్ట్ అవార్డు కూడా అందుకున్నారు. చంద్రయాన్-2 మిషన్‌లో అత్యంత కీలకమైన మహిళా శాస్త్రవేత్తగా అందరి మన్ననలను పొందారు. ఆమె చంద్రయాన్-3 ప్రాజెక్టులో కూడా పనిచేశారు. చంద్రయాన్-2 ప్రాజెక్టుకు డైరెక్టర్‌గా పనిచేసిన ఎం.వనిత ఉపగ్రహాలు తయారు చేయడంలో దిట్ట. ఆమె డిజైన్ ఇంజినీర్‌గా శిక్షణ తీసుకుని చంద్రయాన్-2 అత్యంత కీలకమైన శాస్త్రవేత్తగా ఎంతో గుర్తింపు పొందారు.'ఆస్ట్రనామికల్ సొసైటీ ఆఫ్ ఇండియా' నుంచి 2006లో బెస్ట్ ఉమెన్ సైంటిస్టు అవార్డును అందుకున్నారు. చంద్రయాన్-3 ప్రాజెక్టులోనూ ఆమె కీలకపాత్ర పోషించారు.